- గాలివానతో రైతన్న హైరానా
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- పంటను కాపాడుకునేందుకు అన్నదాతల తిప్పలు
- దర్గా కాజీపేటలో రైల్వే ట్రాక్‌పైకి రేకులు
- తడిసిన వడ్లను ఆరబెట్టేందుకు పాట్లు
- సర్కారు కాలయాపన చేయడం వల్లేనని ఆగ్రహం



నర్సింహులపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

# కల్లాల్లో కన్నీళ్లు

చేతికొచ్చిన పంటను అమ్ముకునే సమయంలో అకాల వర్షం నిండా ముంచుతోంది. ఆరుగాలం శ్రమించి పండించిన వడ్లు కల్లాల్లో తడిసిపోతుండడంతో కాపాడుకునేందుకు రైతన్న పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. బుధవారం ఉమ్మడి జిల్లా అంతటా మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించగా భూపాలపల్లిలో వడగండ్లు పడి ఆగమాగం చేశాయి. మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ, నర్సింహులపేట, చిన్నగూడూరు, నెల్లికుదురులో అకాల వర్షం కురిసింది. హనుమకొండ జిల్లాలోని దర్గా కాజీపేటలో పలు ఇండ్ల రేకులు లేచిపోయి రైలు పట్టాలపై పడ్డాయి. స్థానికులు, రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై రేకులను అక్కడి నుంచి తొలగించారు. ములుగుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భూపాలపల్లి పట్టణంలో ఉరుములు, మెరుపులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది.

– నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 30 :

## మెరిసిన మానుకోట

- పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం
- 99.29 శాతం ఉత్తీర్ణత
- 3, 8 స్థానాల్లో జనగామ, ములుగు
- బాలికలదే హవా

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో మానుకోట మెరిసింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో 99.29 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. అన్ని పాఠశాలల్లో 8,184 మంది విద్యార్థులకు 8126 మంది ఉత్తీర్ణులు కాగా బాలుర కంటే బాలికల ఉత్తీర్ణతా శాతం అధికంగా ఉంది. జిల్లాలో 15 కేజీబీవీలకు 14 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. కాగా సమష్టి కృషి వల్లే రాష్ట్రంలో మొదటి స్థానం దక్కిందని మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇక 98.81 శాతంతో జనగామ రాష్ట్రంలో 3వ స్థానం, ములుగు 97.64 శాతంతో 8, 96.13 శాతం ఉత్తీర్ణతో హనుమకొండ 18, జయశంకర్ భూపాలపల్లి 22, వరంగల్ జిల్లా 93.09 శాతంతో 23వ స్థానంతో సరిపెట్టుకుంది.






















